క్లుప్తంగా

ఫార్మాసిస్టుల పాత్ర కీలకం



ఫార్మాసిస్టులతో సూపరింటెండెంట్ డాక్టర్ సి. ప్రభాకర్‌రెడ్డి

కర్నూలు(హాస్పిటల్): ఆసుపత్రిలో రోగులకు మందులు ఇచ్చే విషయంలో ఫార్మాసిస్టుల పాత్ర కీలకమని ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ఫార్మాసిస్టుల దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం పెద్దాస్పత్రిలోని డిస్పెన్సరీలో కేక్ కట్ చేసి ఫార్మాసిస్టులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సీఎస్‌ఆర్‌ఎంఓ డాక్టర్ బి.వెంకటేశ్వరరావు, డ్రగ్ స్టోర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శారద, ఫార్మాసిస్టులు కృష్ణమోహన్‌శర్మ, నరసప్ప, సత్యప్రసాద్, శ్రీనివాస్ రాజేష్, రిటైర్డ్ ఫార్మాసిస్టు నరసింహరావు పాల్గొన్నారు.

డ్రెయినేజీలను నిర్మించాలి



చెత్త దిబ్బలను పరిశీలిస్తున్న డీవైఎఫ్‌ఐ నాయకులు

కర్నూలు(సెంట్రల్): ఇందిరాగాంధీ నగర్‌లోని సుందరయ్య భవన్ సమీపంలో డ్రెయినేజీలు పాడవడంతో మురుగునీరు రోడ్లపైకి వస్తున్నా మునిసిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి వై.నగేష్ ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం డీవైఎఫ్‌ఐ బృందం పర్యటించి పాడైన డ్రెయినేజీలు, పేరుకుపోయిన చెత్త దిబ్బలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..డ్రెయినేజీలను పునర్ నిర్మించాలని, చెత్త దిబ్బలను డంపుయార్డుకు తరలించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు అబ్దుల్లా, గురుశేఖర్ పాల్గొన్నారు.

ఎస్‌ఈ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు చేపడుతున్న జి.రాజశేఖర్

కర్నూలు (టౌన్): నగరపాలక సూపరింటెండెంట్ ఇంజినీర్‌గా జి.రాజశేఖర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. నెల్లూరు టిడ్కో ఎస్‌ఈగా పనిచేస్తున్న ఆయనను ప్రభుత్వం ఇటీవల కర్నూలు కార్పొరేషన్‌కు బదిలీ చేసింది. ఈ సందర్భంగా ఎస్‌ఈ మాట్లాడుతూ గతంలో ఇక్కడ పనిచేసిన అనుభవం ఉందని, ఉన్నతాధికారులు, ఉద్యోగుల సహకారంతో అభివృద్ధి పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తామన్నారు. అనంతరం ఇంజినీర్లు, సిబ్బంది, మున్సిపల్ కాంట్రాక్టర్లు ఆయనను కలిసి అభినందనలు తెలియజేశారు.

భక్తిశ్రద్ధలతో అనఘాష్టమి వ్రతం



పూజల్లో పాల్గొన్న భక్తులు



ప్రత్యేక అలంకారంలో దత్తాత్రేయ స్వామి

కర్నూలు కల్చరల్: స్థానిక సూర్యనారాయణ స్వామి ఆలయంలో బుధవారం అష్టమిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దత్తాత్రేయ స్వామికి విశేష పూజలు, అనఘాష్టమి వ్రతం జరిగాయి. ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని గౌరీశంకర స్వామికి ప్రాతఃకాలంలో విశేష పంచామృతాభిషేకం, అన్నాభిషేకాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయం మేనేజింగ్ ట్రస్టీ శివరామకృష్ణ, ట్రస్ట్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

వీధి బాలల గుర్తింపునకు తనిఖీలు

కర్నూలు (లీగల్): నగరంలోని వీధి బాలల గుర్తింపునకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకటశేషాద్రి, శాశ్వత లోక్ అదాలత్ అధ్యక్షులు వెంకట హరినాథ్, దిశ డీఎస్పీ కె.శ్రీనివాసచారి, ఏసీఎల్‌సీ సాంబశివ, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ ఎస్.జుబేదాబేగం తదితరులు తనిఖీలు చేపట్టారు. సంబంధిత శాఖ అధికారులు, డీసీపీఓ శారద, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, జిల్లా ప్రొబేషనరీ అధికారి, పోలీసు, విద్యాశాఖ, జువైనల్ సంక్షేమం అధికారుల సహకారంతో బుధవారం రెండు బృందాలుగా ఏర్పడి కొత్త బస్టాండ్, పాతబస్టాండ్, జిల్లాపరిషత్, కృష్ణానగర్, ఇండస్ట్రియల్ ఏరియా, రాజ్‌విహార్, చెన్నమ్మ సర్కిల్, ఆటో నగర్, 1వ టౌన్ ప్రాంతాల్లో పర్యటించి వీధిబాలల కోసం తనిఖీలు నిర్వహించారు.

క్రీడల్లో రాణిస్తే ఉద్యోగావకాశాలు మెండు

- డీవీఈఓ పరమేశ్వర రెడ్డి
- ఎస్‌జీఎఫ్ అండర్ -19 హాకీ, వాలీబాల్ ఎంపిక పోటీలు ప్రారంభం



హాకీ పోటీలను ప్రారంభిస్తున్న డీవీఈవో పరమేశ్వర రెడ్డి

కర్నూలు (టౌన్): క్రీడల్లో రాణిస్తే ఉద్యోగావకాశాలు మెండుగా ఉంటాయని జిల్లా వృత్తి విద్యాశాఖ అధికారి వై. పరమేశ్వర రెడ్డి సూచించారు. బుధవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ అండర్ -19 విభాగంలో హాకీ, వాలీబాల్ ఎంపిక పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కూల్‌గేమ్స్‌ను క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే స్థానిక ఆదర్శ జూనియర్ కళాశాలలో అండర్-19 విభాగంలో రగ్బీ ఎంపిక పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో కేవీఆర్ కళాశాల ప్రిన్సిపాల్ లాలప్ప, ఎస్‌జీఎఫ్ అండర్-19 కార్యదర్శి హర్షవర్ధన్, వాలీబాల్ సీనియర్ క్రీడాకారుడు జాఫర్ మున్నా, ఫిజికల్ డైరెక్టర్లు రియాజ్, ప్రసాద్, ఫాతిమా, జయకుమార్ పాల్గొన్నారు.

అంతర్ కళాశాలల రగ్బీ పోటీలు ప్రారంభం

నగర శివారులోని ఆదర్శ విద్యా మందిర్ క్రీడా ప్రాంగణంలో అంతర్ పాఠశాలల బాలికల రగ్బీ పోటీలు ప్రారంభమయ్యాయి. బుధవారం గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ శంకర్‌శర్మ పాల్గొన్నారు. పోటీలను నుద్దేశించి ఆయన మాట్లాడుతూ చదువు, క్రీడలకు ప్రాధాన్యత ఇచ్చి బాలికలు రాణించాలన్నారు. కార్యక్రమంలో రగ్బీ సంఘం కార్యదర్శి రామాంజనేయులు పాల్గొన్నారు.

క్రీడాదుస్తుల పంపిణీ



క్రీడాకారులతో రోయింగ్ సంఘం అధ్యక్షులు అరవింద రెడ్డి

కర్నూలు (టౌన్): ఈనెల 26 నుంచి 29 వరకు తమిళనాడు రాష్ట్రంలోని చెంగల్పట్టులో నిర్వహించనున్న 18వ జాతీయ స్థాయి ఫ్లోర్ బాల్ పోటీల్లో పాల్గొనన్ను జిల్లా క్రీడాకారులకు జిల్లా రోయింగ్ సంఘం అధ్యక్షులు అరవింద రెడ్డి క్రీడాదుస్తులు పంపిణీ చేశారు. బుధవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ జాతీయ స్థాయి పోటీల్లో విజేతలుగా నిలవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా ఫ్లోర్ బాల్ సంఘం కార్యదర్శి ఈశ్వర్ నాయుడు, ఒలింపిక్ సంఘం కార్యవర్గ సభ్యులు సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

అసభ్యకర ప్రవర్తన టీచర్లను శిక్షించాలి

కర్నూలు సిటీ: విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించే ఉపాధ్యాయులను కఠినంగా శిక్షించాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అఖండ, బి.మహేంద్రబాబు, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రంగప్ప, అబ్దుల్లా తదితరులు బుధవారం డీఈఓ కాగిత శామ్యూల్‌ను వేర్వేరుగా కలిసి వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యాబుద్ధులు చెప్పాల్సిన ఉపాధ్యాయులు వృత్తికే మచ్చ తెచ్చే విధంగా విద్యార్థినుల పట్ల వ్యవహరిస్తుండటం విచారకరమన్నారు. తల్లిదండ్రుల తరువాత గురువులదే స్థానమని, ఆ స్థానాన్ని నిలబెట్టుకోవాల్సిన కొందరు ఉపాధ్యాయులు సభ్యసమాజం చీదరించుకునే విధంగా ప్రవర్తించడం బాధాకరమన్నారు. పెద్దకడబూరు ఆదిఆంధ్ర ప్రాథమిక పాఠశాల టీచర్‌పై విచారణ చేసి, ఇలాంటి ఘటనలు భవిష్యత్తులో జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. విద్యాశాఖ అధికారులు ఘటనలు జరిగిన స్కూళ్లకు వెళ్లి విద్యార్థులకు ధైర్యం కలిగించే అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు.

అవినీతిని ప్రశ్నించాలి



ఆత్మీయ సన్మానం అందుకున్న ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులతో ఆర్పీ పట్నాయక్

- నిజాయతీ అధికారులతోనే మంచి పాలన
- సంగీత దర్శకులు ఆర్పీ పట్నాయక్

కర్నూలు కల్చరల్: కళ్ల ముందు జరుగుతున్న అవినీతిని ప్రతిఒక్కరూ ప్రశ్నించాలని ప్రముఖ సంగీత దర్శకులు ఆర్పీ పట్నాయక్, మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు సూచించారు. ప్రభుత్వ శాఖల్లో పనిచేసిన, చేస్తున్న నిజాయతీ అధికారులను బుధవారం స్థానిక సస్య హోటల్‌లో యూత్ ఫర్ యాంటీ కరప్షన్ సంస్థ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆర్పీ పట్నాయక్ మాట్లాడుతూ నిజాయతీ అధికారులతోనే ప్రజలకు మంచి పాలన అందుతుందన్నారు. ఉద్యోగుల ఎంపికలో రాజకీయ పైరవీలకు తావివ్వకుండా పారదర్శకంగా జరగాలన్నారు. నిజాయతీ అధికారుల సంఖ్య పెరగాలని ఆకాంక్షించారు. నిజాయతీ అనేది పాఠశాల, ఇల్లు, ఆలయాల్లో పెరగాలన్నారు. మంచి వ్యక్తులతోనే మంచి పాలన, విలువలు గల సమాజం ఏర్పడుతోందన్నారు. ఇప్పటి సమాజంలో నిజాయతీకి గుర్తింపు తగ్గిపోతుందన్నారు. ఆ గుర్తింపును యూత్ ఫర్ యాంటీ కరప్షన్ సంస్థ ఇవ్వడం చాలా గర్వకారణమన్నారు. ఇలాంటి కార్యక్రమాలు నిరంతరం సాగుతూ ఉండాలన్నారు. మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు మాట్లాడుతూ సమాజంలో జరుగుతున్న అవినీతిని ప్రశ్నించాలన్నారు. ప్రభుత్వాలు ప్రతి సమాచారాన్ని ప్రజలకు అందుబాటులో ఉంచాలన్నారు. యాక్ చేస్తున్న కార్యక్రమాలు అభినందనీయమన్నారు. యూత్ ఫర్ యాంటీ కరప్షన్ ఫౌండర్ రాజేంద్ర పల్నాటి, రాయలసీమ కో ఆర్డినేటర్ నారాయణ, హైదరాబాద్ సరస్వతి హాస్పిటల్స్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్, యాక్ మహిళా విభాగం ప్రతినిధి డాక్టర్ స్రవంతి గాధిరాజు, కాంకర్ కళాశాల అధినేత వేణుగోపాల్ పాల్గొన్నారు.

ప్రభుత్వం మొద్దునిద్ర



కలెక్టరేట్ ఎదుట ప్లేట్లు, గరిటెలతో శబ్దం చేస్తూ నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

కర్నూలు(సెంట్రల్): కూటమి ప్రభుత్వం పాలనను గాలికొదిలి మొద్దు నిద్రలో ఉందని డీసీసీ అధ్యక్షుడు పి.మురళీకృష్ణ విమర్శించారు. అధికారం చేపట్టి వంద రోజులైనా ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడాన్ని నిరసిస్తూ బుధవారం కలెక్టరేట్ ఎదుట ప్లేట్లు, గరిటెలతో శబ్దం చేస్తూ(థాలి బజావో) ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో మహిళలు, విద్యార్థులు, రైతులు, నిరుద్యోగులకు అనేక హామీలు ఇచ్చి చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చారన్నారు. సీఎం అయ్యాక బడ్జెట్ లేదంటూ హామీలను దాటవేసే ప్రయత్నం చేస్తుండటం సిగ్గుచేటన్నారు. మరోవైపు 100 రోజుల పాలనలో ఇది మంచి ప్రభుత్వం అంటూ ఇంటింటికీ స్టిక్కర్లు అంటించడం హాస్యాస్పదమన్నారు. నిద్ర మేల్కొపేందుకే థాలి బజావో కార్యక్రమం చేపట్టామన్నారు. రాబోయే రోజుల్లో సూపర్‌సిక్స్ పథకాలను అమలుచేయకపోతే ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి మారెప్ప, మాజీ ఎమ్మెల్సీ సుధాకర్‌బాబు, కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు జిలానీబాషా, సీనియర్ నాయకుడు పీజీ నరసింహులు యాదవ్ పాల్గొన్నారు.

నిందితుడికి నాలుగేళ్ల జైలుశిక్ష



ముద్దాయి బోయ నాగరాజు

కర్నూలు (లీగల్): దాడి కేసులో నిందితుడికి నాలుగేళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ కర్నూలు అదనపు అసిస్టెంట్ సెషన్స్ జడ్జి పి.దివాకర్ బుధవారం తీర్పు చెప్పారు. కేసు వివరాల్లోకి వెళితే.. కర్నూలు త్రీటౌన్ పరిధిలోని బిర్లాగేట్ సమీపంలో 2023 సంవత్సరం నవంబర్ 29వ తేది రాత్రి ఉలిందకొండకు చెందిన మల్లెపోగు ప్రభాకర్, నగర శివారులోని టీవీ9 కాలనీకి చెందిన బోయ నాగరాజు ఘర్షణ పడ్డారు. ఈ ఘటనలో తనను తాను రక్షించుకునేందుకు నిందితుడు నాగరాజు ప్రభాకర్‌ను సిమెంట్ ఇటుకతో తలపై బాది పరారయ్యాడు. తీవ్రంగా గాయపడిన వ్యక్తిని అటువైపు వెళ్తున్న వనపర్తి జిల్లా వెలిగొండ గ్రామానికి చెందిన సూర్యచంద్రశేఖర్ గమనించి అంబులెన్స్‌లో ప్రభుత్వ వైద్యశాలకు పంపాడు. వైద్యులు పరీక్షించి మృతి చెందాడని నిర్ధారించారు. తర్వాత సీఐ మురళీధర్‌రెడ్డి నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించగా తాను చెత్త పేపర్లు ఏరుకుని జీవిస్తానని, అపరిచితుడైన ప్రభాకర్ వచ్చి దాడి చేయగా ఇటుకతో తలపై బాదినట్లు తెలిపారు. నేరం రుజువు కావడంతో నిందితుడైన నాగరాజుకు కోర్టు నాలుగేళ్ల జైలు శిక్ష విధించింది. ప్రాసిక్యూషన్ తరపున పీపీ జి.బాలరంగస్వామి వాదించారు.

అభివృద్ధి ప్రతిబింబించేలా ప్రణాళికలు

- అన్ని గ్రామాల్లో స్వర్ణాంధ్ర-2047 గ్రామ సభలు నిర్వహించాలి

కర్నూలు(సెంట్రల్): అభివృద్ధి ప్రతిబింబించేలా మండల స్థాయి ప్రణాళికలు రూపొందించాలని కలెక్టర్ పి.రంజిత్‌బాషా ఎంపీడీఓలను ఆదేశించారు. బుధవారం సాయంత్రం స్వచ్ఛతా హీ సేవ, ఇది మంచి ప్రభుత్వం, స్వర్ణాంధ్ర-2047 కార్యక్రమాల నిర్వహణపై జిల్లా, మండల స్థాయి అధికారులతో కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల స్థాయి ప్రణాళికలను మొక్కుబడిగా కాకుండా తాగునీరు, పరిశ్రమలు, వ్యవసాయం, ఉపాధి కల్పన అంశాలను క్రోడీకరించి రూపొందించాలన్నారు. వాటి ఆధారంగానే జిల్లా స్థాయి ప్రణాళికలను రూపొందించాలన్నారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని అన్ని గ్రామాల్లో నిర్వహించి ఇంటింటికీ స్టిక్కర్లను అంటించేలా చర్యలు తీసుకోవాలన్నారు. స్వర్ణాంధ్ర-2047 విజనరీ కోసం ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరించాలన్నారు. మొబైల్ ఫోన్ల ద్వారా క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి ప్రజలు తమ అభిప్రాయాలను తెలిపేలా ప్రణాళికలు రూపొందించాలన్నారు. టెలీ కాన్ఫరెన్స్‌లో జేసీ డాక్టర్ బి.నవ్య పాల్గొన్నారు.

నూతన ఆవిష్కరణలను తెలుసుకోవాలి



ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టి నరసమ్మకు జ్ఞాపిక అందజేస్తున్న వైస్ ప్రిన్సిపాల్ విజయానంద బాబు

కర్నూలు (హాస్పిటల్): వైద్యులు ఎప్పటికప్పుడు వచ్చే నూతన ఆవిష్కరణల గురించి తెలుసుకుంటూ ఉండాలని కర్నూలు మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ సూచించారు. మెడికల్ కళాశాలలోని మెడికల్ ఎడ్యుకేషన్ యూనిట్‌లో మూడు రోజులుగా నిర్వహిస్తున్న బీసీఎంఈ కోర్సు ముగింపు కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ చిట్టినరసమ్మ మాట్లాడుతూ వైద్య విద్య నిరంతర పరిశోధనలతో కూడుకున్నదన్నారు. వైద్యులు ఎప్పటికప్పుడు అప్‌డేట్‌గా ఉంటూ రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ విజయానంద బాబు, ఎంఈయూ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ డాక్టర్ సింధియా శుభప్రద, సభ్యులు డాక్టర్ విశాల, డాక్టర్ అరుణ, డాక్టర్ కుముద, డాక్టర్ భానుప్రకాష్ పాల్గొన్నారు.

బ్రాహ్మణ సంఘ ఎన్నికలకు భారీగా నామినేషన్లు

కర్నూలు (అర్బన్): ఈనెల 29న జరగనున్న నగర బ్రాహ్మణ సంఘ ఎన్నికలకు సంబంధించి మొత్తం 6 పోస్టులకు గాను 32 నామినేషన్లు దాఖలైనట్లు సహాయ ఎన్నికల అధికారి సందేల్ చంద్రశేఖర్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఎన్నికల అధికారి గొబ్బూరి శేషాద్రి ఆధ్వర్యంలో ఎన్నికలను నిర్వహించడం జరుగుతుందన్నారు. అధ్యక్ష స్థానానికి 8, ఉపాధ్యక్ష స్థానానికి 15 నామినేషన్లు దాఖలయ్యాయన్నారు. కార్యదర్శి పోస్టుకు 6, సంయుక్త కార్యదర్శి పోస్టుకు 7, కోశాధికారి స్థానానికి 4 నామినేషన్లు దాఖలయ్యాయన్నారు. నామినేషన్ల దాఖలుకు, పరిశీలన, ఉపసంహరణకు ఆఖరి రోజు కావడంతో ఇద్దరు తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారన్నారు.నామినేషన్ల పరిశీలనలో ముగ్గురు నామినేషన్లను తిరస్కరించినట్లు తెలిపారు.

ఏజీఎంసీగా సుంకన్న

కర్నూలు సిటీ: ఇంటర్మీడియెట్ జిల్లా వృత్తివిద్యాధికారి కార్యాలయంలో జిల్లా స్థాయి అకడమిక్ గైడె న్స్ అండ్ మానిటరింగ్ సెల్ ఆఫీసర్‌గా గూడూరు ప్రభుత్వ జూనియర్ కాలేజీ లైబ్రరీ సైన్స్ లెక్చరర్ డాక్టర్ నాయకల్లు సుంకన్నను నియమిస్తూ ఇంట ర్మీడియెట్ బోర్డు రీజినల్ జాయింట్ డైరెక్టర్ రవినాయక్ ఉత్తర్వులు జారీ చేసినట్లు డీవీఈఓ వై.పరమేశ్వరరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

పకడ్బందీగా ఓటరు జాబితా సవరణ

- నగరపాలక కమిషనర్ రవీంద్రబాబు

కర్నూలు (టౌన్): ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని నగరపాలక కమిషనర్ ఎస్.రవీంద్రబాబు సూచించారు. బుధవారం నగరపాలక నూతన కౌన్సిల్ హాలులో రాజకీయ పార్టీల ప్రతినిధులు, బీఎల్‌ఓలతో కమిషనర్ వేర్వేరుగా సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాలపై అభ్యంతరాలు, అభిప్రాయాలు స్వీకరించాలన్నారు. అలాగే జనవరి 1వ తేదీ 2025 సంవత్సరం నాటికి 18 ఏళ్లు నిండే ప్రతి ఒక్కరిని నూతన ఓటరుగా నమోదు చేసేందుకు ఇంటింటికి సర్వే పక్కాగా చేపట్టాలన్నారు. ఓటరు నమోదు మార్పులు చేర్పులకు సంబంధించి ఫారం-6, ఫారం-7, ఫారం -8 ఫారం-13, ఫారం-14 దరఖాస్తులను త్వరగా పరిశీలించాలన్నారు. నూతన ఓటరు నమోదు, ఓటరు చిరునామాలో మార్పులు, చేర్పులు, పోలింగ్ కేంద్రాల మార్పునకు దరఖాస్తులు స్వీకరించాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌ఓ జునీద్ పాల్గొన్నారు.

పారిశుధ్య మెరుగు పడాలి

నగరంలో మరింత మెరుగ్గా పారిశుధ్య పనులు నిర్వహించాలని నగరపాలక కమిషనర్ రవీంద్రబాబు ఆదేశించారు. బుధవారం నగరంలోని రాజీవ్ గృహకల్ప, వెంకటేశ్వర నగరర్, బాబా బృందావన్ నగర్, రాఘవేంద్రా నగర్ ప్రాంతాలలో కమిషనర్ పారిశుధ్య పనులను తనిఖీ చేశారు. క్రిష్ణారెడ్డి నగర్‌లో శిథిలావస్థకు చేరిన 200 కిలో లీటర్ల సామర్థ్యం కలిగిన వాటర్ ట్యాంకుకు మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు.

ప్రజలు భాగస్వాములు కావాలి

- జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా

కర్నూలు (రూరల్) : స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో ప్రజలు భాగస్వాములు కావాలని, తద్వారా గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకునే అవకాశం ఉంటుందని కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. బుధవారం కల్లూరు మండలం చెట్లమల్లాపురం గ్రామంలోని స్వచ్ఛతా హీ సేవా, ఇది మంచి ప్రభుత్వం, స్వర్ణాంధ్ర 2047 కార్యక్రమాల్లో భాగంగా నిర్వహించిన గ్రామ సభకు హాజరైన జిల్లా కలెక్టర్ ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. గ్రామంలో వ్యక్తిగతంగా పరిశుభ్రంగా ఉంచేందుకు ఒక నిర్దిష్టమైన స్థలాన్ని ఏర్పాటు చేసుకుని అక్కడే చెత్త వేసేలా చూడాలన్నారు. నిరుపయోగంగా ఉన్న చెత్తను క్లాప్‌మిత్రల ద్వారా షెడ్‌కు తరలించి రీసైక్లింగ్ చేయించాలని సూచించారు. అనంతరం గ్రామంలోని 9 మంది షెడ్ మిత్ర, క్లాప్ మిత్రలను జిల్లా కలెక్టర్ సన్మానించారు. అనంతరం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం అని 100 రోజుల్లో సాధించిన విజయాలను వివరిస్తూ ప్రతి ఇంటికి కరపత్రం అందించి స్టిక్కర్ అతికించడం జరుగుతుందన్నారు. 2047 నాటికి స్వాతంత్ర్యం వచ్చి వంద సంవత్సరాలు పూర్తి అవుతున్న సందర్భంగా అప్పటికి మన గ్రామం, మండలం, జిల్లా అభివృద్ధి సమగ్రంగా సాధించేందుకు అవసరమైన ప్రణాళికలు రూపొందించి అమలు చేయడం వలన ప్రపంచ స్థాయిలో పోటీ తట్టుకునే విధంగా గ్లోబల్ సిటిజన్స్‌గా మారే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ కళ్యాణి, గ్రామ సర్పంచు భూపాల్‌రెడ్డి, ఎంపీపీ బోయ శారద, జిల్లాపరిషత్ సీఈఓ నాసర రెడ్డి, డీపీఓ నాగరాజు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

గానగంధర్వుడు బాల సుబ్రహ్మణ్యం



బాలు చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న కళాకారులు

కర్నూలు కల్చరల్: గానగంధర్వుడు బాల సుబ్రహ్మణ్యమని టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య అన్నారు. బుధవారం సీ క్యాంప్ కళాక్షేత్రంలో ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం వర్ధంతిని నిర్వహించారు. బాలు చిత్ర పటానికి సంగీత కళాకారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పత్తి ఓబులయ్య మాట్లాడుతూ 40 వేల సినిమా పాటలు పాడిన ఏకైక గాయకుడు బాల సుబ్రహ్మణ్యం అన్నారు. దేశంలో 13 భాషల్లో ఆయన పాడిన పాటలు ఉన్నాయన్నారు. ఘంటసాల, బాలు తర్వాత సినీ రంగంలో మంచి గాయకులు కరువయ్యారన్నారు. ఆయన లేని లోటు తీర్చలేనిదన్నారు. అనంతరం బాలు పాడిన పాటలను పలువురు గాయకులు పాడి అలరించారు. కార్యక్రమంలో సంగీత గాయకులు బీవీ ప్రకాష్, పుష్పరాజ్, శామ్యూల్, బాల వెంకటేశ్వర్లు, పాండురంగయ్య, కళాక్షేత్రం సభ్యులు సీవీ రెడ్డి, రాజారత్నం, యాగంటీశ్వరప్ప, ఈశ్వరయ్య, లక్ష్మీకాంతరావు, సంగా ఆంజనేయులు, గాండ్ల లక్ష్మన్న, బలరాముడు, రచయిత ఎస్‌డీవీ అజీజ్ పాల్గొన్నారు.

ఎస్పీ ఆధ్వర్యంలో డీపీఓలో నేర సమీక్ష సమావేశం

- హాజరుకానున్న రేంజ్ డీఐజీ

కర్నూలు: జిల్లా పోలీసు కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో ఎస్పీ బిందుమాధవ్ ఆధ్వర్యంలో గురువారం నేర సమీక్ష సమావేశం జరగనుంది. కర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్ సమావేశంలో పాల్గొంటున్నారు. ఆగస్టు నెలలో స్టేషన్ల వారీగా నమోదైన కేసులతోపాటు పెండింగ్ కేసులు, ఇళ్లు, గొలుసు దొంగతనాలు, సమస్యాత్మక ప్రాంతాల్లో కార్డెన్ సెర్చ్, ఫ్యాక్షన్ ప్రభావిత ప్రాంతాల్లో శాంతిభద్రతల పరంగా తీసుకుంటున్న చర్యలు తదితర అంశాలపై సమీక్షించనున్నారు. అలాగే గంజాయి వినియోగం, అక్రమ రవాణా, సరిహద్దు చెక్ పోస్టులలో నిఘా, పొరుగు రాష్ట్రాల నుంచి జిల్లాలోకి అక్రమ మద్యం రాకుండా కట్టడికి తీసుకుంటున్న చర్యలు, మత్తుకు బానిసలైన విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు కౌన్సిలింగ్, మైనర్లు ద్విచక్ర వాహనాలు వినియోగించకుండా తీసుకుంటున్న చర్యలు, రోడ్డు ప్రమాదాలు, పట్టణాల్లో రోడ్డు భద్రత చర్యలు తదితర అంశాలపై చర్చించనున్నారు. గత నెలలో జరిగిన నేర సమీక్ష సమావేశంలో తీసుకున్న నిర్ణయాల అమలు తదితర అంశాలపై చర్చించనున్నారు. ఈ మేరకు జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల ఎస్‌హెచ్‌ఓలు నివేదికలు సిద్ధం చేసుకున్నారు.

రైతులను నిర్లక్ష్యం చేస్తున్న కూటమి ప్రభుత్వం

కర్నూలు (రూరల్) : రైతులను కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ విమర్శించారు. రైతు సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం కర్నూలు ఆర్డీఓ కార్యాలయం ముందు రైతు సంఘం మండల అధ్యక్షుడు ఆంజనేయులు అధ్యక్షతన ధర్నా చేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ ఇది మంచి ప్రభుత్వం అంటూ సమావేశాలు నిర్వహిస్తూ గొప్పగా ప్రచారం చేసుకోవడం తప్పా చేసిందేమీ లేదన్నారు. అనంతరం ఆర్డీవో శేషిరెడ్డికి వినతిపత్రం అందజేశారు.

ప్రజలను పదే పదే తిప్పకోవద్దు

- సచివాలయాల సిబ్బందికి యూనిఫామ్ తప్పని సరి
- నగరపాలక కమిషనర్ రవీంద్రబాబు



శరీన్‌నగర్ సచివాలయంలో సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్ రవీంద్రబాబు

కర్నూలు (టౌన్): వివిధ పనులు నిమిత్తం వచ్చే ప్రజలను పదే పదే తిప్పుకోవద్దని నగరపాలక కమిషనర్ రవీంద్రబాబు సూచించారు. బుధవారం శరీన్‌నగర్‌లోని 71, 75 సచివాలయాలను ఆయన తనిఖీ చేసి, సిబ్బందితో మాట్లాడారు. సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. తప్పనిసరిగా యూనిఫామ్, ఐడీ కార్డు ఉండాలన్నారు. కమిషనర్ వెంట నగరపాలక ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి పాల్గొన్నారు.

కార్మికుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ

నగరపాలకలో పనిచేస కార్మికుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు నగరపాలక కమిషనర్ రవీంద్రబాబు తెలిపారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా బుధవారం నగరంలో 17 అర్బన్ హెల్త్ సెంటర్‌లో పారిశుధ్య కార్మికులకు మెడికల్ క్యాంపులు నిర్వహించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ భాస్కర్, ఆరోగ్యశాఖ అధికారి విశ్వేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

గర్భిణులకు రక్తహీనత లేకుండా చూడాలి



అవగాహన కల్పిస్తున్న మాస్ మీడియా అధికారి శ్రీనివాసులు

కర్నూలు(హాస్పిటల్): గర్భిణులకు రక్తహీనత లేకుండా చూడాల్సిన బాధ్యత వైద్య సిబ్బందిపై ఉందని మాస్ మీడియా అధికారి శ్రీనివాసులు సూచించారు. బుధవారం స్థానిక గడ్డ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని తెలుగుగేరి సచివాలయంలో జరుగుతున్న వ్యాధినిరోధక టీకాల కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. గర్భిణులు ప్రతి రోజూ కనీసం రాత్రి 10 గంటలు, పగలు 2 గంటలు విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. రక్తహీనత లేకుండా సురక్షితమైన ప్రసవం కోసం ఆరోగ్యకరమైన పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. గర్భిణీలు సరైన పౌష్టికాహారం తీసుకుంటే వారికి జన్మించే బిడ్డలు ఆరోగ్యంగా ఉంటారన్నారు. డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ నవజాత శిశువు రోగాల బారిన పడకుండా వ్యాధినిరోధక టీకాలు తప్పనిసరి అని, పుట్టిన బిడ్డ నుంచి 16 ఏళ్ల వరకు పలు విడతలుగా ప్రభుత్వం ఉచితంగా టీకాలు పంపిణీ చేస్తుందన్నారు. తల్లిదండ్రులు కూడా తమ బిడ్డల ఆరోగ్యంపై శ్రద్ధ చూపుతూ నిర్దేశించిన కాలమానిని ప్రకారం టీకాలు వేయించాలన్నారు. కార్యక్రమంలో సచివాలయ ఏఎన్‌ఎం నాగమ్మ, ఆశా కార్యకర్త తిరుపతమ్మ, ప్రాజెక్షనిస్టు ఖలీల్ పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల పంపిణీ



విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎల్. భాస్కర్

కర్నూలు(హాస్పిటల్): జిల్లా ఎయిడ్స్ నియంత్రణ విభాగం ఆధ్వర్యంలో నగరంలో గత నెల 24న మారథాన్ రెడ్ రన్, ఈనెల 11న హైస్కూల్ విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. విజేతలకు బుధవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఎల్.భాస్కర్, జాతీయ హెల్త్ మిషన్(డీపీఎంఓ) డాక్టర్ ఉమా చేతుల మీదుగా నగదు బహుమలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ఎయిడ్స్ నియంత్రణ విభాగం క్లస్టర్ ప్రోగ్రామ్ మేనేజర్ వెంకటరత్నం, జిల్లా ఎంఅండ్‌ఈ అసిస్టెంట్ శంకర్‌గౌడ్, స్పోర్ట్స్ అథారిటీ వాలీబాల్ కోచ్ రవి, సుధాకర్ పాల్గొన్నారు.

మారథాన్ విజేతలు వీరే..

పురుషుల విభాగంలో ఎ.దివాకర్(ఎస్ఆర్ డిగ్రీ కాలేజీ), జి.ప్రసాద్ (ప్రభుత్వ డిగ్రీ(పురుషుల) కళాశాల), మహిళ విభాగంలో మల్లికాబాయి(ప్రభుత్వ డిగ్రీ కళాశాల(పురుషులు)), డి.వెంకటేశ్వరి (రవీంద్ర ఇంజినీరింగ్ కాలేజీ), ట్రాన్స్‌జెండర్ల విభాగంలో జి. లీలావతి, జి.కీర్తి ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు.

క్విజ్ పోటీలో..

ఏపీజే అబ్దుల్ కలామ్ మున్సిపల్ హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు లిఖిత, ప్రీతీష్ మొదటి స్థానంలో, ఐజీఎంఎంసీ హైస్కూల్ విద్యార్థినులు వేదవతి, విజయలక్ష్మి రెండవ స్థానంలో నిలిచారు.